# తెగిన తీగలు

## —దూపాటి సీతాదేవి

ట్రెయిన్ విజయవాడ స్టేషన్ వదలి పరుగులు తీస్తున్నది ఆ ట్రెయిన్‌లో ప్రయాణం చేస్తున్న మూర్తి ఏదో ఆలోచిస్తున్నాడు

తన భార్య మాధవి నిద్ర పోతున్నది. సీటుకి జారిగిలబడి రాత్రి ప్రయాణం అంటె కష్టమే మరి. పాపం అందులో, నెలలు నిండిన మనిషి కూడా

మాధవిని చూస్తే జాలివేసిందతడికి.

ఆమెకి శ్రమ అనికూడా, ఆలోచించకుండా రాత్రిపూట ప్రయాణం చేయిస్తున్నాడు. తనెంత దుర్మార్గుడు మూర్తి బాధగా అనుకున్నాడు జాలిగా మాధవిని చూస్తూ.

తనకి పెళ్ళి అయి సంవత్సరమే అయింది. ఇంజనీరు తను. పెద్దకట్నంతో మాధవి తనకి భార్యగా లభించినది. మాధవి సున్నితమైన మనస్సు కలది. ఎంతో నిదానం, ఓర్పు వున్నాయి ఆమెలో.

మాధవి లాంటి అందమైన భార్య దొరికినందుకు తనని తనమిత్రులంతా ఎంతో పొగిడారు మూర్తి అదృష్టవంతుడు మరొకడు లేడన్నారు. సంతోషంతో పొంగిపోయాడు తను.

మాధవి కాపురానికి వచ్చిన క్రొత్తల్లో కొంచం మౌనంగా దిగాలుగా, వుండేది.

తను ఆశ్చర్యపోయాడు.

అదేమిటి? అత్యంత వైభవంగా తండ్రి పెళ్ళి చేశాడు

ఒక్కగానొక్క కూతురు, తల్లి, తండ్రులకు మాధవి.

ఏ లోటు లేకుండా పెంచారు, కాని, ఆమె అట్లా మౌనంగా, వుండటం తనకి బాధ కలిగించేది.

అప్పటికీ ఒకరోజు అడిగాడు.

"మధూ? ఎందుకు అట్లా మౌనంగా, దిగులుగా వుంటావు? ఈ పెళ్ళి నీకు ఇష్టం లేదా?" అడిగాడు తను, అట్బె అదేం లేదండి, మా అమ్మవాళ్ళకి నేను ఒక్కదాన్నే కదూ? నన్ను విడిచి వాళ్ళూ, వాళ్ళని విడిచి నేనూ వుండలేక." అంతే అన్నది చిరునవ్వుతో మాధవి.

తేలిక పడ్డ మనసుతో అమ్మయ్యా అనుకున్నాడు తను

డబ్బుకు లోటులేని జీవితం, కారు, మేడా, హోదా వున్నాయి అందమైన భార్యవుంది. అంతకన్నా యింకేం కావాలి? అనుకుంటూ మూర్తిగర్వంగా నవ్వుకున్నాడు క్షణకాలం.

మాధవి తల్లి కాబోతున్నదని తెలుసుకొని సంతోషంతో మిత్రులందర్ని ఆహ్వానించి విందు చేశాడు. ఘనంగా —

మాదవికి అది మొదటి పురుడు గనుక పుట్టింటికి తీసుకువెళ్లుతున్నారు

"మధూ నీకేం మీ అమ్మగారింట్లో హాయిగా వుంటావు. నేను ఒక్కడ్ని ఇక్కడ ఒంటరిగా ఎట్లావుండటం" అని తను అనే సరికి, చిరునవ్వుతో "అయితే మీరు కూడా, శెలవు పెట్టి నాతో వచ్చెయ్యండి" అంది మాధవి

శెలవు పెట్టి మాధవితో బయలు దేరాడు, అత్తగారింటికి, పుట్టబోయే పాప కోసం, ఎన్నో తీయని కలలు కంటున్నాడు తను, తండ్రి కాబోతున్నాడు తను ఆ మాట తనకి పదింతలు గర్వాన్ని తెచ్చి పెట్టింది, ఏదో తెలియని పులకిత శరీరాన్ని ఆక్రమిస్తుంది.

"మధూ? నీకు పాప కావాలా? బాబు

కావాలా ? అని అడిగాడు తను.

"ఎవరైతేనేం లెండి. తల్లిగా నా బాధ్యత నిర్వహించటానికి. భగవంతుడిష్టం, మన ఇష్టా యిష్టాలతో ప్రమేయం ఏముంది అనేసింది.

తన మనస్సు చివుక్కుమంది. మాధవి మాటల తీరుకి, ఒకరికి సంతోషం కలిగించే విషయం, మరొకరికి బాధ కలిగిస్తుందేమోలే అనుకున్నాడు.

ఆ రోజు మరీ ఉషారుగా వచ్చాడు ఇంటికి "మధూ అప్పుడే పుట్టబోయే పాపయి కోసం ఆలోచిస్తు కూర్చునావా ? ఏమో నీకు పాపపుట్టినా, బాబూ పుట్టినా, నన్ను మాత్రం మరిచిపోతావు గ్యారంటీ అన్నాడు తను.

"మనుషుల్ని అంత తొందరగా మరచిపోయే స్వభావం కాదులెండినాది అంది

తను మౌనంగా వుండిపోయాడు, మరో మాట మాట్లాడలేక, మాధవి ఎందుకు తనని అంత నిరాశపరుస్తున్నది. ఆమెకి తను ఏం లోటు చేస్తున్నాడని అనుకున్నాడు.

ఆలోచించగా, ఆలోచించగా, మాధవిని అడగెయ్యాలని పించింది. ఒక రోజు.

"మధూ? నీవువరినైనా ప్రేమించావా? నీ తల్లి దండ్రులు, నీ మాటకాదని నాకు ఇచ్చి చేసారా ? నిజం చెప్పు. నీవు అట్లా మౌనంగా, దిగాలుగా వుంటే నేను భరించ లేను." అడిగాడు తను.

కళ్లెత్తి ఆశ్చర్యంగా చూచింది మాధవి.

"మీరూ ఎలాంటి అనుమానాలు మనస్సులో పెట్టుకోవద్దు. నా స్వ భా వ మే అంత." అనేసింది వేలిగ్గా.

"మధూ ! "బ్యూటిక్వీన్"లో మంచి పిక్చర్ వచ్చిందట, వెళదాము. తొందరగా, తయారు కావాలి" .... అంటూ హడావిడిగా ఆఫీసునుండి వచ్చాడు తను.

- "తల నొప్పిగావుంది రాలేను. మీరు వెళ్ళండి" అనేసింది మాధవి.

"పోనీ ఎక్సైజ్‌కి వెళదామా ? అక్కడ వెదర్ నీకు బాగుంటుందేమో. ప్రశాంతంగా కాసేపు కూర్చొని మనస్సు విప్పి మాట్లాడుకుందాము. వస్తావా?" అని అడిగాడు తను.

"నేను ఎక్కడికి రాలేను. "సారీ ; ఏమి అనుకోవద్దు" అంటూ, అక్కడనుండి లోపలికి వెళ్ళిపోయింది

ఒక్కొక్క రోజు మాధవి ప్రవర్తనకి, కోపం ఆవేశం, వచ్చేవి. కానీ భరించుకునేవాడు

అన్నీ వున్నా. అనుభవించే యోగ్యత లేని నిర్భాగ్యుడు తను, అనుకున్నాడు.

"మధూ ! మీ నాన్నగారు ఉత్తరము రాసారు నిన్ను పంపమని వెళతావా ? లేక వాళ్ళనే పిలిపించమంటావా ?" అని అడిగాడు నవ్వుతూ తను.

"వాళ్ళని ఎందుకు లెండి ఇంత దూరం పిలిపించటం. నేనే వెళతాను" అనేసింది మాధవి.

"తను తొందర పడ్డాడేమో ? ఆమెను చేసుకోవటంలో, కానీ, ఆమె మనస్తత్వం ముందుగా, తనకి ఎట్లా తెలుస్తుంది ? ఆమె పరిచయం లేనిది ? అని సమర్థించుకున్నాడు.

మూర్తి మాధవిలో మార్పు తేవటం ఎట్లా? ఆమె సంతోషంగా, మాట్లాడేటట్లు చేయటం ఎట్లా ? ఆమె మనస్సులోని విషయాలు తెలుసుకోవటం ఎట్లా అని ఆలోచిస్తూ, కూర్చున్నాడు.

ట్రెయిన్ హైదరాబాద్ స్టేషన్ చేరుకుంది. మాధవి తండ్రి కారు తీసుకొని స్టేషన్‌కి వచ్చాడు. తండ్రిని అసలు పలకరించలేదు మాధవి ముభావంగానే వున్నది.

ఇల్లు చేరగానే మాధవి తల్లివచ్చి ఎంతో ఆప్యాయంగా పలకరించింది. బంధువులు అందరూ వున్నారు, అక్కడ మాధవి వాళ్ళతోనూ పలకలేదు.

ఓ రోజు మాధవికి నెప్పులు ప్రారంభ

(మిగతా 61వ పేజీలో)

# తెగిన తీగలు

(13 వ పేజీ తరువాయి)

మైనాయి. హాస్పటల్లో చేర్చారు.

"భగవంతుడా, మాధవి సుఖంగా ప్రసవించి, ఆరోగ్యంగా వుండి మంచి బిడ్డను కంటే ఆమెలో ఏమైనా మార్పు వస్తుందేమో' అని చేతులు జోడించి మనస్సులోనే నమస్కరించుకున్నాడు మూర్తి

ఆ రాత్రి పన్నెండు గంటల సమయంలో మాధవి ప్రసవించి. పండంటి బిడ్డను కన్నది. ప్రసవించటానికి ఎంతో కష్టపడింది. ఆపరేషన్ చేసి బిడ్డను తీయాల్సి వచ్చింది. తెల్లవారు ఝామున వాతం కమ్మి మరణించింది మాధవి.

అన్ని ఆశలు అడుగంటినాయి మూర్తికి. గుండెలు అవిసి పోయేలా ఏడ్చాడు.

ఈ ఉత్తరము మీకు యివ్వమన్నారంటూ ఒక కవరు అందించింది హాస్పటల్ నర్సు ఆత్రంగా తీసి చదివాడు మూర్తి.

...నన్ను క్షమించండి, పెద్దలు చేసిన తప్పులకి చిన్నలు శిక్ష అనుభవించాలి తప్పదు. నేను బ్రతుకుతానో, చస్తానో నాకే నమ్మకం లేదు అందుకు వ్రాస్తున్నాను, నాకేమైనా అయితే ఈ ఉత్తరం మీకు అందజేయమన్నాను.

నేను కాలేజిలో క్రొత్తగా ప్రవేశించిన రోజుల్లో, రవితో పరిచయం అయింది ఆ పరిచయమే ప్రణయంగా మారింది. వివాహం చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది, నాన్నకి ఎట్లాగో తెలిసింది. రవిని పిలిచి నానా దుర్భాషలాడాడు, రవికి మతి భ్రమించి ఎటో వెళ్ళిపోయాడు, నాన్న బలవంతంగా నా నోరు మూయించి మీతో పెళ్ళి జరిపించాడు. ఒకరోజు బాల్కనీలో కూర్చుని వీధిలోకి చూస్తుండగా, పిచ్చివాడుగా, రోడ్డు మీద తిరుగుతున్న రవిని చూచాను, నా మనస్సు, మనస్సులో లేదు, రవిని ఎట్లా మర్చిపోగలను నా వల్లకాదు. మా నాన్న మీద కసి తీరుకోవటం కోసం. నేను అట్లా ప్రవర్తించాను మీరు, నా ప్రవర్తన గురించి నాన్నతో చెవితే నాన్న బాధపడాలని, లేదా విసిగి మీరు నన్ను తిరస్కరిస్తే మా నాన్నకు బుద్ధిరావాలని అనుకున్నాను కానీ మీరు చాల మంచివాళ్ళు.

మీ లాంటి సహృదయుల్ని బాధ పెట్టినందుకు క్షమించండి. పుట్టిన బాబుని జాగ్రత్తగా పెంచండి, అంతకన్నా మిమ్మల్ని ఏమీ కోరను

నా తప్పుల్ని క్షమించగలరని నా నమ్మకం

మీ దికాలేని

"మాధవి"

ఆ ఉత్తరము చదవగానే మూర్తి తల తిరిగిపోయింది. ఎంతపని చేశావు మాధవీ అంటూ రోధిస్తూ కూలబడి పోయాడు"

